ఆర్థికాభివృద్ధి.. విత్త విధానం కీలకపాత్ర

గ్రూప్ 1, 2 ఎకానమీ సిలబస్‌లో విత్త విధానం ముఖ్యమైన పాఠ్యాంశం. దీనినుంచి ప్రశ్నలు వచ్చే అవకాశమున్నందున అభ్యర్థులు విత్త విధానం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయడం మంచిది.

ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు సాధనకు తోడ్పడుతూ, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధిని (అన్ని వర్గాలకు సమానంగా ఆదాయ పంపిణీ) సాధించడంలో ప్రభుత్వ విత్త విధానం (Fiscal Policy) బహుముఖ పాత్ర పోషిస్తుంది. జాతీయ వనరులను సమీకరించి, ఆర్థిక వృద్ధిని పెంపొందించడంతో పాటు వనరులను సమర్థవంతంగా కేటాయించి ఫలితాలు సాధించడంలో విత్త విధానం ప్రభావం ఎంతో ఉంది.

ఫిస్కల్ విధానం ప్రాముఖ్యత

అభివృద్ధి చెందిన దేశాలలో సాధించిన ఆర్థికవృద్ధిని స్థిరీకరించడం, అభివృద్ధి చెందుతున్న దేశాలలో వృద్ధిని త్వరితగతిన సాధించడంలో ఫిస్కల్ విధానాలు కీలకమైనవి. 1930లో వచ్చిన ఆర్థిక మాంద్యం (Great Depression), జె.ఎం. కీన్స్ చేసిన ఆర్థిక రచనల తర్వాత ఒక ఆర్థిక సాధనంగా ఫిస్కల్ విధానం ప్రాముఖ్యతను గుర్తించారు.

ఆర్థిక వ్యవహారాలలో నామమాత్రపు పాత్రను వహిస్తూ ప్రభుత్వం కేవలం శాంతిభద్రతల వరకు మాత్రమే పరిమితంగా ఉండాలనే భావన ఉండేది. క్లాసికల్ సిద్ధాంతం ప్రకారం ఏ ప్రభుత్వమైతే తక్కువ జోక్యంతో పరిపాలన చేస్తుందో అదే ఉత్తమ ప్రభుత్వం (That Government is the best that governs the least). అయితే 1930లో ఆర్థికమాంద్యం పరిస్థితుల తర్వాత దేశాల ఆర్థిక వ్యవస్థలు తిరిగి బలం పుంజుకోవడంలో ప్రైవేటు రంగం సమర్థవంతమైన పాత్రను పోషించలేకపోవడంతో ఆ బాధ్యతను ప్రభుత్వ రంగమే వహించాల్సి వచ్చింది.

ఖర్చు-పెట్టుబడుల ద్వారా ఉద్యోగితను కల్పించడానికి ప్రభుత్వ జోక్యం తప్పనిసరి అని భావించారు. ఆర్థికమాంద్యం లేదా ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినపుడు ఆర్థికవ్యవస్థను తిరిగి సామాన్యస్థితికి తెచ్చే బాధ్యత ప్రభుత్వం మీదే ఉంటుంది. ఎడ్వర్డ్ షపీరో చెప్పినట్లు... మొత్తం ఆర్థికవ్యవస్థ ఆదాయం, ఉత్పత్తులకు సంబంధించి పన్నుల విధానం (Taxation), ప్రభుత్వ వ్యయం (Government Expenditure)ల ప్రాముఖ్యత పెరిగింది.

నిరుద్యోగ సమస్యను అధిగమించడంలో ద్రవ్యవిధానం (Monetary Policy) తన ప్రభావం చూపెట్టకపోవడం, స్థూల డిమాండు (Aggregate demand)కు ప్రాధాన్యమిస్తూ కీన్స్ ఆర్థికశాస్త్రాన్ని కొత్తగా నిర్వచించడం వంటి కారణాల వల్ల ఫిస్కల్ (విత్త) విధానాలు 1930 తర్వాత ప్రాముఖ్యతను కోల్పోయాయి.

ఫిస్కల్ ఆయుధాలలో ప్రధానమైనవి

- పన్నుల విధానం (Taxation)
- ప్రజల వద్ద నుంచి రుణాలు (Public Borrowing)
- లోటు ఆర్థిక విధానం (Deficit financing)
- ప్రభుత్వ వ్యయం (Public Expenditure)

పన్నుల విధానం

ఆభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో ప్రభుత్వానికి రెవెన్యూ (ఆదాయం) తెచ్చే మార్గాలలో పన్నుల విధానం ప్రముఖమైంది. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు, నిర్వహణ ఆ ప్రభుత్వం పన్నుల వసూళ్ళ సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. పన్నుల ద్వారా వచ్చే రాబడి జాతీయ ఆదాయంలో ప్రస్తుతం ఉన్న 10-15 శాతం నుంచి 30-40 శాతం వరకు వృద్ధి చెందేందుకు భారత్‌లాంటి దేశాలు కృషిచేస్తున్నాయి.

ఆదాయం రెండు రకాలు

ప్రత్యక్ష పన్నులు : వ్యక్తులు, సంస్థల నుంచి సంపద, ఆస్తుల మీద ప్రత్యక్షంగా వసూలు చేసే పన్నులు

పరోక్ష పన్నులు : వస్తు, సేవలపై విధించిన పన్నుల ద్వారా వచ్చే పరోక్ష ఆదాయం. అంటే వాణిజ్య పన్నులు, ఎక్సైజు డ్యూటీలు (ఎగుమతులు - దిగుమతుల సుంకాలు). బాగా అభివృద్ధి చెందిన దేశాలు ప్రత్యక్ష పన్నుల ఆదాయం మీద ఆధారపడితే తక్కువ ఆదాయం గల దేశాలు పరోక్ష పన్నుల నుంచి (3/4 వంతు) ఆదాయం పొందుతున్నాయి. మధ్యస్తంగా అభివృద్ధి చెందిన దేశాలు పరోక్ష పన్నుల ద్వారా 50 శాతం ఆదాయం పొందుతున్నట్లు 1988లో ప్రపంచ బ్యాంకు రిపోర్టు వెల్లడించింది.

రుణాల సేకరణ

పన్నుల తర్వాత స్థానంలో ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయమార్గం ప్రజల నుంచి రుణాల సేకరణ. అయితే ఈ రకంగా వచ్చిన ఆదాయాన్ని కాల పరిమితి ప్రకారం తిరిగి ప్రజలకు చెల్లించాలి. ఇది ఒక విధంగా అభివృద్ధి వ్యయాలకు విత్తాన్ని సమకూర్చుకోవడానికి కావా

ల్సిన 'ఫండ్'ను ఏర్పాటు చేసుకోవడమే. ప్రభుత్వ సెక్యూరిటీలు, బిల్లులు మనీ మార్కెట్టులో అమ్మి స్వచ్ఛందంగా సేకరించడం, లేదా తప్పనిసరి (Compulsory loan) రుణాలను ప్రజల వద్ద నుంచి సేకరించడం అంటే ఐదు నుంచి పదేళ్ల తర్వాత చెల్లించే విధంగా పన్నురహిత బాండ్లు జారీచేయడం, ఉద్యోగుల భవిష్యనిధికి తప్పనిసరిగా జీతభత్యాల నుంచి ఎక్కువ మొత్తాలను మళ్ళించడం మొదలైన విధానాలను ప్రభుత్వం అవలంబిస్తుంది. నిర్దేశించిన కాలం తర్వాత లేదా పేర్కొన్న సందర్భాలలో గానీ, రిటైర్‌మెంట్ తర్వాత గానీ ఈ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.

ఈ విధమైన పబ్లిక్ రుణాల సేకరణ ద్వారా ప్రభుత్వం తనకు కావాల్సిన ఆదాయాన్ని సమకూర్చుకోవడం ఇటీవల అన్ని దేశాల లోనూ కన్పిస్తోంది. అభివృద్ధి చెందుతున్న వివిధ దేశాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలు, అవసరాలకు అధిక ఆర్థిక వనరులు కావాల్సి ఉంటుంది. కాబట్టి ఈ విధంగా తప్పనిసరి రుణాల విధానం ద్వారా నిధులు సమకూర్చుకొంటుంది. అంతేకాకుండా ఈ నిధుల సాయంతో సాధించిన అభివృద్ధి ఫలాలే భవిష్యత్‌లో పబ్లిక్ రుణాలను తిరిగి చెల్లించే శక్తిని ఆర్థిక వ్యవస్థకు కల్పిస్తాయి. ఉదాహరణకు మౌలిక సదుపాయాలైన రోడ్లు, రైల్వే విస్తరణ. భారీ పరిశ్రమలు, నీటిపారుదల మొదలైన రంగాల అభివృద్ధి జాతీయ ఉత్పత్తి/ఆదాయాలను పెంచడంలో గొప్ప పాత్ర వహిస్తాయి.

ప్రత్యక్ష పన్నుల విధానం ద్వారా ఎక్కువ ఆదాయ వనరులు పొందవచ్చు గానీ, ప్రస్తుత తరం ప్రజలకు (Present generation of Tax payers) అధిక పన్నులు చెల్లించడం కొంత అసంతృప్తిని కలుగజేస్తుంది. కానీ పబ్లిక్ రుణాల పద్ధతిలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఎంతో సంతృప్తినిస్తుంది. విద్య, వైద్యాలయాలు, తాగునీరు మొదలైన వాటి మీద ఆర్థిక లాభాలు ప్రత్యక్షంగా లేకపోయినప్పటికీ అవి సమాజానికి ఎంతో ఉపకరిస్తాయి. కాబట్టి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను పబ్లిక్ రుణాల విత్త విధాన ప్రక్రియలో చేపట్టడమే మంచిదనే అభిప్రాయం ఉంది.

లోటు ఆర్థిక విధానం (Deficit Financing)

బడ్జెట్‌లో ఆదాయాల కన్నా వ్యయాలు ఎక్కువగా ఉన్నప్పుడు, ఉత్పత్తులకు సరైన డిమాండు లేక నిరుద్యోగం ప్రబలే పరిస్థితులున్నప్పుడు ప్రభుత్వం బడ్జెటరీ లోటు(Budgetary Gap)ను రుణాల ద్వారా భర్తీ చేస్తుంది. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లోటు ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం అంటే కరెన్సీని ముద్రించి చలామణిలో ఉంచడంగా భావిస్తారు. అయితే ఈ లోటు బడ్జెట్‌ను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా భర్తీ చేసే విధానాలు 1930లో చేపట్టారు. పూర్తిస్థాయి డిమాండు(Aggregate Demand)లో లోటు వల్ల ప్లాంటు సామర్థ్యం పూర్తిగా వినియోగించుకోకపోవడంతో అధిక స్థాయిలో నిరుద్యోగ (Mass scale unemployment) సమస్యలు వస్తాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు పన్నుల ద్వారా, విదేశీ పెట్టుబడుల ద్వారా, ప్రజల నుంచి రుణాల ద్వారా ఆ లోటును పూరించడానికి ప్రయత్నిస్తాయి.

డెఫిసిట్ ఫైనాన్సింగ్ పద్ధతి ద్వారా అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లో ప్రభావిత గిరాకీ (Effective Demand)ని పెంచుతారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజల పొదుపులను సేకరించి వనరుల సమీకరణకు ఉపయోగిస్తారు.

ప్రభుత్వ వ్యయం (Public Expenditure)

ప్రజాహిత, మౌలిక రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ప్రత్యేకంగా ప్రైవేటు రంగం అంతగా ఆసక్తి చూపని మౌలిక, సామాజిక ప్రాజెక్టులపై ప్రభుత్వం భారీగా వ్యయం చేస్తుంది. తద్వారా ఈ పనులు, నిర్మాణ కార్యక్రమాలలో పనిచేసే వారికి ఉపాధి లభించి ఆదాయ మార్గాలు వృద్ధిచెంది వస్తువుల ఉత్పత్తికి డిమాండు పెరుగుతుంది. దీంతో పరిశ్రమల్లో 'ఆర్థిక రికవరి' సాధ్యమవుతుంది. వ్యవసాయ రంగంలో ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ, చౌకధరల దుకాణాల ద్వారా ఆహార ధాన్యాల సరఫరాలపై ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుంది.

అదేవిధంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగుమతుల వృద్ధికి ప్రభుత్వం ప్రకటించే ఎగుమతి సబ్సిడీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వెచ్చించే నిధులు – ఇవన్నీ ప్రభుత్వ వ్యయాల కిందకు వస్తాయి.

ఫిస్కల్ విధానాలు – కొన్ని సమస్యలు

విధాన ప్రక్రియను వెనక్కులాగే కొన్ని అంతర్గత సమస్యలున్నాయి. ద్రవ్య (Monetary) విధానంలో కాకుండా ఫిస్కల్ (విత్త) విధానాల అమలుకు పార్లమెంటు, శాసనసభల ముందస్తు అనుమతి అవసరం. ఈ అనుమతి పొందడం క్లిష్టమైన ప్రక్రియ. అనుమతి పొందిన తర్వాత కూడా ఫిస్కల్ విధానం అమలు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ సాధ్యం కాకపోగా, మరింత అస్థిరత్వ పరిస్థితులకు దారితీసే అవకాశం ఉంది.

భారత్... ఫిస్కల్ విధానం

తిరోగమన కాలంలో నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో ద్రవ్య విధానం విఫలమవడం, సమష్టి డిమాండ్ పెంపుదలలో ప్రభుత్వ వ్యయం, పన్నుల విధానం ప్రాధాన్యం సంతరించుకోవడంతో కోశ విధాన పరిధి పెరిగింది. మొత్తం ఉత్పత్తిలో సంభవించే ఒడిదుడుకులను నియంత్రిస్తూ అధిక ఆర్థిక వృద్ధి సాధించడంలో కోశ విధాన పాత్ర కీలకమైంది.

వనరుల సమర్థ వినియోగం ద్వారా పెట్టుబడులను ప్రోత్సహించేదే అభిలషణీయమైన కోశ విధానం (ఫిస్కల్ పాలసీ). ఫలితంగా ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది. ఆదర్శవంతమైన పన్నుల విధానం ఆదాయ పంపిణీలో అసమానతల్ని తొలగిస్తుంది. కోశ విధానంలో భాగంగా సమాచార రంగం, నీటిపారుదల, విద్యుత్‌లపై పెట్టుబడులు మౌలిక సౌకర్యాల మెరుగుదలకు దోహదపడి ఆర్థికాభివృద్ధికి దారి తీస్తాయి. వ్యాపార చక్రాల వల్ల కలిగే ప్రభావాలను నియంత్రిస్తూ ధరల స్థిరత్వం సాధించడానికి కోశ విధానం ఉపకరిస్తుంది. కోశ విధానంలో భాగంగా ప్రభుత్వం తన వ్యయ, రాబడి కార్యక్రమాలను జాతీయాదాయం, ఉత్పత్తి, ఉద్యోగితలపై అనుకూల ప్రభావాలు చూపే విధంగా రూపొందిస్తుంది. వనరుల సమర్థ పంపిణీ, వాటి యాజమాన్యంపై ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆధారపడి ఉంటుంది. Incremental capital output ratio (ICOR) భవిష్యత్ వృద్ధి ధోరణులకు ముఖ్య సూచిక. ICOR ఎక్కువైతే ఆ ఆర్థిక వ్యవస్థలో సమర్థత తక్కువని భావించవచ్చు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ICOR ఎక్కువగా ఉన్నందున దీని తగ్గుదలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నిష్పత్తిలో తగ్గుదల లక్షిత వృద్ధి సాధనకు అవసరమైన కొత్త వనరుల అవసరాన్ని తగ్గిస్తుంది. ప్రభుత్వం అవలంభించే కోశ విధానం ఈ నిష్పత్తి తగ్గుదలకు దారి తీసి సమర్థత పెంచేవిధంగా ఉండాలి. ఆశించిన రీతిలో ఆర్థిక వ్యవస్థను నియంత్రించి తద్వారా ఆర్థిక వృద్ధిని, సమానతను, ఆర్థిక స్థిరీకరణను సాధించే ప్రక్రియగా కోశ విధానాన్ని భావించవచ్చు.

కోశ విధానం – సాధనాలు – లక్ష్యాలు

ప్రభుత్వ ఆదాయ, వ్యయ విధానాల మొత్తం ప్రభావం ఆదాయం, ఉత్పత్తి, ఉద్యోగితపై ఎలా ఉంటుందో తెలియజేసేదే కోశ విధానం. దీనిలో ముఖ్యంగా వ్యయ, పన్ను, రుణ, లోటు విత్త విధానాల ద్వారా ప్రభుత్వం అనుకున్న రీతిలో ఆర్థిక వ్యవస్థను నియంత్రించి వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి, అసమానతల నిర్మూలనకు, ధరల స్థిరీకరణకు తోడ్పడి సమాజ శ్రేయస్సుని గరిష్టం చేసే ప్రయత్నం చేస్తుంది.

కోశ విధాన సాధనాలు ముఖ్యంగా 1) పన్ను విధానం 2) ప్రభుత్వ వ్యయ విధానం 3) ప్రభుత్వ రుణ విధానం 4) లోటు బడ్జెట్ విధానం. వీటి ద్వారా మన దేశంలో కోశ విధాన లక్ష్యాల సాధనకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

వనరుల సమీకరణ, ఆర్థికాభివృద్ధి సాధించడం, ఆదాయ అసమానతలు తగ్గించడం, పూర్ణోద్యోగిత సాధించడం, ధరల స్థిరత్వం కోశ విధానం లక్ష్యాలు. పెట్టుబడికి అవసరమైన నిధులను ప్రభుత్వం రెండు విధాలుగా సమీకరిస్తుంది. అవి 1) స్వచ్ఛంద పొదుపు 2) నిర్బంధ పొదుపు. ప్రజల నుంచి రుణాలు, పన్నుల ద్వారా వనరుల సమీకరించవచ్చు. తలసరి ఆదాయాలు తక్కువ అవడంతో స్వచ్ఛంద పొదుపు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాధాన్యం సంతరించుకోలేక పోయింది. కొత్త పన్నుల విధింపు, ప్రస్తుత పన్ను రేట్ల పెంపు ద్వారా ప్రభుత్వం ఎక్కువ వనరులను సమీకరించుకోగలదు.

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడానికి కోశ విధానం దోహదపడుతుంది. ఆదాయ అసమానతల్ని తగ్గించడానికి ధనిక వర్గాలు, విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై ఎక్కువ పన్ను విధించాలి. తద్వారా వచ్చిన రాబడి బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగిస్తే సంపద పునఃపంపిణీ సాధ్యమవుతుంది. మౌలిక సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం చేసే వ్యయం, పెట్టుబడి అవకాశాల విస్తరణ, కొన్ని ఉత్పత్తులకిచ్చే రాయితీలు, సబ్సిడీలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి దారి తీస్తాయి. ప్రభుత్వ వ్యయంలో ఉత్పాదక వ్యయ నిష్పత్తి ఎక్కువైతే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. కోశ విధాన సాధనాలను ఉపయోగించుకుంటూ ఉపాధి అవకాశాల పెంపుదలకు చర్యలు తీసుకోవాలి. ఆర్థికాభివృద్ధికి పూర్ణోద్యోగిత ఒక సూచిక లాంటిది. ఆర్థికాభివృద్ధి జరగకుండా ఉద్యోగిత సాధ్యం కాదు. వెనుకబడిన ప్రాంతాల్లోని పరిశ్రమలకు పన్ను రాయితీలు, మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వ వ్యయం లాంటి చర్యలు ఉద్యోగితను పెంపొందిస్తాయి. ధరల స్థిరత్వం సాధించడం కోశ విధానం లక్ష్యం. ద్రవ్యోల్బణ కాలంలో ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకుంటూ పన్నులు విధించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి తగ్గించాలి. ప్రతి ద్రవ్యోల్బణ కాలంలో ప్రభుత్వ వ్యయం పెంచుతూ బడ్జెట్ రూపొందించుకోవాలి. తద్వారా వినియోగ ప్రవృత్తి ఎక్కువగా ఉండే వర్గాల్లోని ప్రజల ఆదాయ స్థాయి పెరుగుదలకు చర్యలు తీసుకోవాలి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కోశ విధాన పాత్ర

అభివృద్ధి చెందిన దేశాల్లో కోశ విధాన లక్ష్యం ఆర్థిక స్థిరత్వం సాధించడం కాగా... ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడం అభివృద్ధి చెందుతున్న దేశాల లక్ష్యంగా ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక పురోగతికి ఆర్థిక స్థిరత్వం ముఖ్యం. ఈ రెండు వ్యవస్థల్లో ఆర్థిక అస్థిరత్వం ఏర్పడినప్పటికీ దీని స్వభావం ఈ వ్యవస్థల్లో వేర్వేరుగా

ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అల్ప ఉత్పత్తి నుంచి ఆర్థికాభివృద్ధి విధానాలను ఫైనాన్స్ చేయడానికి సరిపడే పొదుపు వనరులను సమీకరించడం... వాటితో పెట్టుబడిని విస్తృతంగా ప్రభుత్వం చేపట్టడానికి ఉపకరించే సాధనం కోశ విధానమని ఐక్యరాజ్య సమితి నివేదిక అభిప్రాయపడింది. ఆర్థికాభివృద్ధి సాధించడానికి చేపట్టే పథకాలు, ప్రాజెక్టులకు అవసరమైన విత్త వనరులు సమీకరించాలి. ఈ దేశాల్లో మూలధన సంచయనం తక్కువైనందున పొదుపును నిర్బంధంగానైనా పెంచవలసిన అవసరం ఉంది. దేశీయంగా వినియోగాన్ని తగ్గిస్తూ ఉత్పాదక రంగాల వైపు పెట్టుబడి మళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. పురోగామి పన్ను విధానం అవలంభించడం, ఈ క్రమంలో విలాసవంతమైన వస్తువుల దిగుమతులపై ఎక్కువ సుంకం విధించి తగిన వనరులు సమీకరించాలి. అభివృద్ధికి అవసరమైన వనరుల సేకరణలో పన్ను విధానం ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. ఈ దేశాల్లో ఆదాయ సంపదల పంపిణీలో అసమానతలు ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటురంగ పాత్ర ఎక్కువైనపుడు సామాజిక, ఆర్థిక సమస్యలు తలెత్తి ఆర్థిక అనిశ్చితి పెరుగుతుంది. అసమానతలు ఎక్కువైనపుడు ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. కాబట్టి ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు సరైన కోశ విధానాన్ని రూపొందించి ఆదాయ సంపదల్లోని వ్యత్యాసాలు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థికవృద్ధి, ధరల స్థిరీకరణ సాధించడం సంయుక్త లక్ష్యాలుగా ఉంటాయి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించుకునే విధంగా ఆయా దేశాలు తమ కోశ విధానాన్ని రూపొందించుకోవాలి. ఈ దేశాల్లో ప్రభుత్వ వ్యయం పెరుగుతున్నందున ధరల స్థాయిలో పెరుగుదల ఏర్పడుతుంది. మరోవైపు వినియోగ, మూలధన వస్తువులు పెరుగుతున్న ఆదాయానికి తగినంతగా లభ్యం కాకపోవడంతో ద్రవ్యోల్బణ వ్యత్యాసం ఏర్పడుతుంది. పన్ను విధానం, రుణ విధానం లాంటి కోశ విధాన సాధనాల్ని ఉపయోగించి ద్రవోల్బణం తగ్గించే చర్యలు చేపట్టాలి. దీనితోపాటు ముఖ్యమైన వస్తువుల ఉత్పత్తి పెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెంచడానికి పన్ను రాయితీలు, సబ్సిడీలు, మినహాయింపులు మాత్రమే సరిపోవు. అనుత్పాదక రంగాల్లో పెట్టుబడులపై ఎక్కువ పన్నులు విధించడం ద్వారా వనరులు ఉత్పాదక రంగానికి బదిలీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి తొలి దశలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. ఈ సౌకర్యాలు మార్కెట్ పరిమాణం పెంపుదలకు, ఉత్పత్తి వ్యయం తగ్గుదలకు, సాంఘిక ఉపాంత ఉత్పాదక పెట్టుబడుల పెరుగుదలకు దారితీసి ప్రైవేటురంగ పెట్టుబడులు పెరగడానికి దోహదపడతాయి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గించడానికి ఈ దేశాలు ప్రభుత్వ వ్యయం తగ్గించుకోవడం, పన్ను రేట్లను పెంచడం, ప్రభుత్వ రుణం పెంచడం లాంటి విధానాల ద్వారా కోశ విధానాన్ని పాటిస్తాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలు వృద్ధిని సాధిస్తున్న కొద్దీ వ్యయం పెరుగుతుండటంతో విత్త వనరుల సమీకరణ విస్తృతి, పరిధి పెరుగుతుంది. అందువల్ల రుణ విధానాన్ని ఈ దేశాలు అత్యంత శక్తిమంతమైన కోశ విధాన సాధనంగా ఉపయోగిస్తున్నాయి. వ్యయ విధానం, పన్ను రాబడి, రుణ విధానం, రుణ నిర్వహణ లాంటి విధానాలు ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా మంచి ఫలితాలు సాధించే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలి. కోశ విధానం మార్కెట్ వ్యవస్థ పనితీరును నియంత్రిస్తుంది.

అల్పాభివృద్ధి దేశాల్లో ఆర్థికాభివృద్ధిని సాధించే కోశ విధాన ప్రక్రియ ప్రభుత్వమే పెట్టుబడిదారునిగా, స్థిరీకరణ దారునిగా, పొదుపరిగా, పునఃపంపిణీదారునిగా ఉంటుందని కీన్స్ అభిప్రాయపడ్డారు. కోశ విధాన సఫలత ఆయా దేశాల్లోని పరిస్థితులు అంటే స్థిరత్వం, మార్కెట్ శక్తులు, కోశ సాధనాల సరైన వినియోగం, విదేశీ మూలధన, వ్యాపార పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 'క్రియాశీలక విత్త విధానం' ద్వారా వనరులు సమీకరించి ఆర్థిక వృద్ధిని, స్థిరత్వాన్ని సాధించవచ్చు. ఈ దేశాలు తమ లోటు విత్త విధానాన్ని కేంద్ర బ్యాంకు నుంచి రుణాలు పొందడం ద్వారా చేపడతాయి. సాధారణ రెవెన్యూ రాబడి కన్నా వ్యయ అవసరాలు ఎక్కువైనపుడు ఈ విధానాన్ని అవలంభిస్తాయి.

ప్రాక్టీస్ బిట్స్

1. రాష్ట్ర ప్రభుత్వాల రుణాల్లో ఏ రుణం ఎక్కువ – మార్కెట్ రుణం
2. తటస్థ పన్ను విధానం అవలంభించాలన్నది – సంప్రదాయ ఆర్థికవేత్తలు
3. 'ద జనరల్ థియరి ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఇంట్రస్ట్ అండ్ మనీ' గ్రంథకర్త – జె.ఎం. కీన్స్
4. పేద ప్రజలను పన్ను విధింపు నుంచి 'ధార్మికంగాను, ఆర్థికంగాను' మినహాయింపు ఇవ్వాలన్నది– జె.ఎం. కీన్స్
5. న్యాయసమ్మతం కానటువంటి అసమానతలు తొలగించాలన్నది – ఆర్.ఎన్. త్రిపాఠి
6. మూలధన వస్తు పరిశ్రమలపై ప్రభుత్వ వ్యయం ఎక్కువైతే అసమానతలు పెరుగుతాయన్నది – కె.ఆర్. రణదేవ్
7. సాంఘిక, కమ్యూనిటీ సేవలపై వ్యయం – అభివృద్ధి వ్యయం
8. రక్షణ రెవెన్యూ వ్యయం, వడ్డీ చెల్లింపులపై వ్యయం – ప్రణాళికేతర వ్యయం
9. రెవెన్యూ లోటు = రెవెన్యూ వ్యయం – రెవెన్యూ రాబడి
10. ప్రాథమిక లోటు = ద్రవ్య లోటు – వడ్డీ చెల్లింపులు
11. లోటు విత్త విధానాన్ని సమర్థించింది – జె.ఎం. కీన్స్
12. బిగ్ పుష్ విధానం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించ వచ్చన్నది – బెంజిమిన్ హిగ్గిన్స్
13. ఉపాంత పొదుపు ప్రవృత్తి అభివృద్ధిని నిర్ణయించే కీలక అంశమని చెప్పింది – నర్క్సే (Nurkse)

విత్త విధానం (ఫిస్కల్ పాలసీ)

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ప్రభుత్వ విత్తవిధానం బహుముఖ పాత్రను పోషిస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలలో సాధించిన ఆర్థికవృద్ధిని స్థిరీకరించడం, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వృద్ధిని త్వరితగతిన సాధించడంలోనూ ఫిస్కల్ విధానాల పాత్ర ఉంటుంది. అయితే ఈ ధ్యేయాల సాధనకు ప్రభుత్వం ఎంతో వ్యయం చేయవలసి ఉంటుంది. ఈ వ్యయాన్ని భరించేందుకు ప్రభుత్వానికి ఆదాయ మార్గాల అన్వేషణ తప్పనిసరి. పన్నుల ద్వారా, ప్రభుత్వ రుణాల పద్ధతి ద్వారా ఆదాయాన్ని పెంచుకొని వ్యయ పరిమాణాన్ని నిర్దేశించే ప్రక్రియనే విత్తవిధానం అంటారు. నిరుద్యోగ సమస్యను అధిగమించడంలో ద్రవ్యవిధానం (Monetary Policy) అంతగా ప్రభావం చూపించలేకపోవడం, స్థూల డిమాండుకు ప్రాధాన్యమిస్తూ కీన్స్ ఆర్థిక శాస్త్రాన్ని కొత్తగా నిర్వచించడం వంటి కారణాల వల్ల ఫిస్కల్ విధానాలు 1930 తర్వాత ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

ఫిస్కల్ ఆదాయాలు

వీటిలో ప్రధానమైనవి

- పన్నుల విధానం
- ప్రజల వద్ద నుంచి రుణాల సేకరణ
- ప్రభుత్వ వ్యయం
- లోటు ఆర్థిక విధానం

పన్నుల విధానం

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు, నిర్వహణ ప్రభుత్వ పన్నుల వసూళ్ల సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం పన్నుల ద్వారా వచ్చే రాబడి జాతీయాదాయంలో ప్రస్తుతం ఉన్న 10-15 శాతం నుంచి 30-40 శాతం వరకు వృద్ధి చెందించేందుకు భారత్ లాంటి దేశాలు కృషిచేస్తున్నాయి.

పన్నుల ద్వారా వచ్చే ఆదాయం రెండు రకాలు 1) ప్రత్యక్ష పన్నులు 2) పరోక్ష పన్నులు. ప్రత్యక్ష పన్నులంటే వ్యక్తులు, సంస్థల నుంచి సంపద, ఆస్తుల మీద ప్రత్యక్షంగా వసూలు చేసే పన్నులు; ఉదాహరణ-సంపద పన్ను, ఆదాయపు పన్ను, కార్పొరేషన్ పన్ను, బహుమతి పన్ను, వడ్డీ పన్ను, వారసత్వ పన్ను మొదలైనవి.

పరోక్ష పన్నులంటే దీనిలో ప్రభుత్వానికి, పన్నులు చెల్లించేవారికి ప్రత్యక్ష సంబంధం ఉండదు. వస్తు, సేవలపై విధించిన పన్నుల ద్వారా వచ్చే పరోక్ష ఆదాయం సమకూరుతుంది. అంటే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ డ్యూటీలు (ఎగుమతులు-దిగుమతుల సుంకాలు) మొదలైనవి.

పన్నురేటు, షెడ్యూల్ ఆధారంగా పన్నుల రకాలు

1. **అనుపాత పన్నులు :** ఆదాయ సంపదలతో సంబంధం లేకుండా ఒకే రేటుతో పన్నులు విధించడాన్ని అనుపాత పన్ను అంటారు.
2. **పురోగామి పన్నులు :** ఆదాయ సంపదల పెరుగుదలతో పాటు పన్నురేటు పెరిగినట్లయితే దానిని పురోగామి పన్నుల విధానం అంటారు.

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులు 5 రకాలుగా ఉన్నాయి.

- కేంద్రం విధించగా రాష్ట్రాలు వసూలు చేసుకొని, వినియోగించుకొనే పన్నులు : స్టాంప్ సుంకాలు, మెడికల్ వస్తువులపై ఎక్సైజ్ సుంకాలు;
- కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు వాటాగా వచ్చేవి. ఉదాహరణకు- విమాన, రైల్వేలు, సముద్ర రవాణా ఏర్పాట్లపై పన్నులు, ఆస్తిపై వారసత్వపు పన్ను మొదలైనవి.
- కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి కేంద్రం-రాష్ట్రాలు పంచుకునే పన్నులు. ఉదాహరణకు- ఎక్సైజు పన్ను
- కేంద్రం విధించి, వసూలు చేసుకొని పూర్తిగా కేంద్రానికే చెందే పన్నులు. ఉదాహరణకు- కస్టమ్స్, కార్పొరేషన్ పన్నులు.

ఇవే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు కూడా ఉన్నాయి. అవి 1) గృహ, గృహస్థ స్థలాలపై పన్ను 2) భూమిశిస్తు 3) ఖనిజాలు, మైనింగు లీజులు 4) రవాణా పన్ను 5) మోటారు వాహనాలపై పన్ను 6) ప్రొఫెషనల్ (వృత్తి) పన్ను 7) సేల్స్‌టాక్స్ .

ప్రజల నుంచి రుణాల సేకరణ

పన్ను ఆదాయం తర్వాత స్థానంలో ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయ మార్గం ప్రజల నుంచి రుణాల సేకరణ. అయితే ఈ రకంగా వచ్చిన ఆదాయాన్ని కాలపరిమితి ప్రకారం తిరిగి ప్రజలకు చెల్లించాలి. ఈ విధంగా ప్రభుత్వం తనకు కావలసిన 'అభివృద్ధి ఫండ్'ను ఏర్పాటు చేసుకుంటుంది. అంతర్గత రుణాలు బ్యాంకులు, ఆర్థిక సహాయ సంస్థలు, ట్రెజరీ బిల్లుల ద్వారా సేకరించుకునే స్వల్పకాలిక రుణాలు, బాండ్లు, సర్టిఫికేట్లు మొదలైనవి.

ఇవే కాకుండా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎం ఎఫ్), ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి పొందే రుణాలు కూడా ఉన్నాయి.

ప్రభుత్వ వ్యయం

ఇది రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది ప్రణాళిక వ్యయం. కేంద్ర

ప్రణాళికల్లో ప్రతిపాదించిన ప్రజాహిత, మౌలిక రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఇక ప్రణాళికేతర వ్యయం కింద ఇప్పటికే దేశంలో నిర్మించిన ప్రాజెక్టులు, పరిపాలనా నిర్వహణ, సబ్సిడీలు, పింఛన్లు, రక్షణ వ్యయం, సామాజిక రంగ సేవలు మొదలైనవి. అదేవిధంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగుమతుల వృద్ధికి ప్రభుత్వం ప్రకటించే ఎగుమతి సబ్సిడీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వెచ్చించే నిధులు ఇవన్నీ ప్రభుత్వ వ్యయాల కిందకు వస్తాయి.

డెఫిసిట్ ఫైనాన్సింగ్ (లోటు విధానం)

ప్రభుత్వ వ్యయాలు ఎక్కువగా ఉండి, ఆదాయ మార్గాలతో సమన్వయం సాధించలేనప్పుడు ఏర్పడే 'గ్యాప్'నే లోటు అంటారు.

రెవెన్యూ లోటు = రెవెన్యూ వ్యయం – కరెంటు రెవెన్యూ వసూళ్లు.

బడ్జెట్ లోటు = మొత్తం వ్యయం – మొత్తం వసూళ్లు.

బడ్జెట్‌లో ఆదాయాల కన్నా వ్యయాలు ఎక్కువగా ఉన్నప్పుడు, ఉత్పత్తులకు సరైన డిమాండ్ లోపించి నిరుద్యోగం ప్రబలే పరిస్థితులున్నప్పుడు ప్రభుత్వం బడ్జెటరీ లోటును రుణాల ద్వారా పూరిస్తుంది. లోటువిధానం ద్వారా అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లో ప్రభావిత గిరాకీని (Effective Demand) పెంచడానికి, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజల పొదుపును సేకరించి వనరుల సమీకరణను ఉపయోగిస్తారు.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. విత్త విధానం (Fiscal Policy) ప్రభావం ఏ అంశాల్లో ఇమిడి ఉంది?
   ఎ) జాతీయ వనరుల సమీకరణ
   బి) వనరులను సమర్థంగా కేటాయించి ఫలితాలు సాధించడం
   సి) ఆర్థికవృద్ధిని పెంపొందించడం
   డి) పైవన్నీ
2. ఒక ఆర్థిక సాధనంగా విత్తవిధానం ఎప్పుడు ప్రాముఖ్యత సంతరించుకుంది?
   ఎ) జె.ఎం. కీన్స్ చేసిన ఆర్థిక రచనలు తర్వాత
   బి) 1930లో వచ్చిన ఆర్థిక మాంద్యం (Great Depression)
   సి) రెండో ప్రపంచ యుద్ధం తర్వాత
   డి) ఎ, బి
3. పన్నుల ద్వారా, ప్రజల నుంచి రుణాలు సేకరించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి వ్యయ పరిమాణాన్ని నిర్దేశించడాన్ని ఏమంటారు?
   ఎ) ద్రవ్య విధానం బి) విత్త విధానం
   సి) పారిశ్రామిక విధానం డి) ఏదీ కాదు
4. పన్నుల విధింపు, వసూలు, వినియోగం భారత రాజ్యాంగంలో ఏ షెడ్యూల్‌లో పొందు పరిచారు?
   ఎ) 8వ బి) 7వ సి) 5వ డి) 9వ
5. పన్నుల విధానం దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలంటే జాతీయాదాయంలో పన్నుల నుంచి వచ్చే ఆదాయం ఎంత శాతం ఉండాలని ఆర్థిక వేత్తల అభిప్రాయం?
   ఎ) 25% బి) 20% సి) 30% డి) 35%
6. విత్తవిధానం ఆవశ్యకత పెరగడానికి కారణం?
   ఎ) ప్రభుత్వ ఖర్చు ద్వారా ఉద్యోగితను కల్పించడానికి ప్రభుత్వ జోక్యం తప్పనిసరి అని భావించడం
   బి) ఆర్థిక మాంద్య లేదా ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడిన తర్వాత ఆర్థిక వ్యవస్థను తిరిగి సామాన్య స్థితికి తెచ్చే బాధ్యత ప్రభుత్వానిదే అని భావించడం
   సి) నిరుద్యోగ సమస్యను అధిగమించడంలో ద్రవ్య విధానం తన ప్రభావం చూపించలేకపోవడం
   డి) అన్నీ
7. పరోక్ష పన్నులు?
   ఎ) అంతిమంగా కొనుగోలుదారుడే భరించవలసి ఉంటుంది
   బి) ఇవి ప్రభుత్వం విధించే పరోక్ష పన్నులు
   సి) అమ్మకందారుడు ప్రభుత్వానికి నేరుగా చెల్లించే పన్ను
   డి) పైవన్నీ
8. కింది వాటిలో ఏవి పరోక్ష పన్నులు?
   ఎ) ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ డ్యూటీలు
   బి) అమ్మకపు పన్ను సి) ఆదాయపు పన్ను
   డి) ఎ, బి
9. బాగా అభివృద్ధి చెందిన దేశాలు ఏ తరహా పన్నుల మీద ఎక్కువగా ఆధారపడి ఉంటాయి?
   ఎ) ప్రత్యక్ష పనులు బి) పరోక్ష పన్నులు
   సి) ఎ, బి డి) పైవన్నీ
10. పబ్లిక్ రుణాల సేకరణ అంటే?
    ఎ) ప్రభుత్వ సెక్యూరిటీలు, బిల్లులు ద్రవ్య మార్కెట్‌లో అమ్మి స్వచ్ఛందంగా ఫండ్ సేకరించడం
    బి) ట్యాక్స్ రహిత బాండ్లను జారీ చేయడం
    సి) ఉద్యోగుల ప్రావిడెంట్ ఖాతాకు జీతభత్యాల నుంచి ఎక్కువ మొత్తాలను మళ్లించడం
    డి) పైవన్నీ
11. తప్పనిసరి రుణాల సేకరణ విత్త విధానం ద్వారా నిధులు సేకరణ ధ్యేయం?
    ఎ) విదేశీ రుణాల చెల్లింపు బి) దిగుమతులు తగ్గించడం
    సి) మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ఆర్థిక ధ్యేయాల సాధన
    డి) ఎ, బి

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11
	D	D	B	B	A	D	D	D	A	D	C

విత్త విధానాలు-సమస్యలు

విత్త (ఫిస్కల్) విధానంలో విధాన ప్రక్రియను వెనకకు లాగే కొన్ని అంతర్గత సమస్యలున్నాయి. ద్రవ్య (Monetory) విధానంలా కాకుండా, ఫిస్కల్ (విత్త) విధానాలకు తప్పనిసరిగా పార్లమెంటు, శాసనసభల ముందస్తు అనుమతి అవసరం. ఈ విధంగా అనుమతులు పొందడం ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. అనుమతులు పొందిన తర్వాత కూడా ఫిస్కల్ విధానం అమలు ఆలస్యం అయ్యే అవకాశముంది. అందువల్ల ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ సాధ్యం కాకపోగా, మరింత అస్థిరత్వ పరిస్థితులకు దారితీయవచ్చు.

పన్నుల విధానంలోని సమస్యలు

పన్నుల చట్టంలోని లోపాలు, ఉన్నత ఆదాయ వర్గాల వారికి లబ్ధి చేకూర్చే పద్ధతుల వల్ల పురోగామి పన్నుల విధానం అనుకొన్న లక్ష్యాలు నెరవేర్చలేకపోయాయి. పన్నుల చెల్లింపునకు ప్రోత్సాహకాలు మరీ మోతాదు మించితే, పన్నుల ఆదాయం తగ్గి, ఆశించిన ఫిస్కల్ ఆశయాలు నెరవేరకపోయే ప్రమాదముంది. ద్రవ్యేతర రంగం ఎక్కువగా విస్తరించిన అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ రంగం నుంచి ఎంత ఆదాయం వస్తుందో చెప్పడం కష్టం. ఎంతో ప్రావీణ్యులైన ట్యాక్స్ నిపుణులు కూడా రైతుల ఆదాయం, స్వయంఉపాధి కింద ఆర్జించే ఆదాయంపై ఎంత అంచనా వేయాలో చెప్పడం కష్టమని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ ఉత్పత్తులపై ఆదాయ పన్ను ఉండదు. అందు వల్ల ట్యాక్స్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గుతుంది. అంతేకాకుండా ట్యాక్స్ పరిపాలనా వ్యవస్థను కఠినంగా నిర్వహించాలి.

పబ్లిక్ రుణాల భారం

రుణాలు తిరిగి చెల్లించేటప్పుడు ఒక్కోసారి పబ్లిక్ రుణాల భారం ఎక్కువ అవుతుంది. అంతర్గతంగా తెచ్చిన రుణాలను దేశీయ కరెన్సీలో, విదేశాల నుంచి తెచ్చిన రుణాలను దేశీయ కరెన్సీలో చెల్లించాలి. కాబట్టి దీనికోసం మనదేశం ఎక్కువ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆర్జించాలి.

లోటు ఆర్థిక విధానం

లోటు ఆర్థిక విధానం కూడా సమస్యలు తెస్తోంది. స్థూల డిమాండ్ పెరుగుదలకు తాజాగా కరెన్సీని చలామణిలోకి ప్రభుత్వం జారీ చేస్తుంది. దీనివల్ల ప్రజల కొనుగోలు శక్తి వెంటనే పెరుగుతుంది. కానీ, అంతే వేగంగా ఉత్పత్తి పెరగకపోవచ్చు. దీనివల్ల ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి, మరింత గందరగోళం జరగవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ధరల పెరుగుదలలో ఏడాదికి ఐదు శాతం కన్నా తక్కువ ఉండాలి. కానీ ఈ శాతం ఎప్పుడూ ఎక్కువగానే ఉంది. ముందు జాగ్రత్త చర్యలు పాటించకుండా లోటు ఆర్థిక విధానం అమలు చేస్తే, ద్రవ్యోల్బణం మరింత పెరిగి పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

విత్త విధానం మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో కింది విధంగా ఉండాలని విశ్లేషకులు భావిస్తున్నారు.

1. ట్యాక్స్ చట్టాలను, పన్నుల పరిపాలనా వ్యవస్థ ను సరళీకరించాలి.
2. తాత్కాలిక పద్ధతిన కాకుంటే స్థిరమైన, స్పష్టమైన పన్నుల విధానం రూపొందించాలి.
3. ట్యాక్స్‌ల పాలనా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలి.
4. వివిధ సామాజిక, ఆదాయ వర్గాలు పన్ను విధానాల ఫలితాలు సమానంగా పొందేలా చర్యలు తీసుకోవాలి.
5. ఫిస్కల్, మానిటరీ విధానాల మధ్య సంబంధాన్ని అనుకరించి సమతౌల్యతను సాధించాలి.
6. శాస్త్రీయ విధానాల ద్వారా ప్రభుత్వ ఖర్చులను నియంత్రించే పద్ధతులు అవలంభించి అనవసర వ్యయాలు తగ్గించాలి.

స్థూల జాతీయోత్పత్తిలో ఐదు శాతానికి పైగా ఉండే ద్రవ్యలోటును నియంత్రించడానికి ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టాన్ని (Fiscal Respo-nsibility & Budget Management Act, 2003) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత, 2003-04లో జీడీపీలో 4.4 శాతంగా ఉన్న ఫిస్కల్ లోటు శాతం 2007-08 నాటికి 2.3 శాతానికి తగ్గింది. 2007-08 ఆర్థిక సర్వే ముందస్తు అంచనాల ప్రకారం ఫిస్కల్ లోటు రూ. 1,50,948 కోట్లుగా ఉంది. FRBM 2003 చట్టం ద్వారా భవిష్యత్తులో చాలావరకు ద్రవ్యలోటు నియంత్రణ జరిగి, ఆశించిన ఫలితాలు సాధించే అవకాశముంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. కేంద్ర ప్రభుత్వమే విధించి,వసూలు చేసుకొని పూర్తిగా కేంద్రానికే చెందే పన్నులు?

   ఎ) కస్టమ్స్ సుంకాలు బి)కార్పొరేషన్ పన్నులు
   సి) భూమిశిస్తు డి)ఎ, బి

2. కేంద్రప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయంగా ఇచ్చేవి?

ఎ) రైల్వేలు బి) ఆకాశ, సముద్ర ఏర్పాట్లపై పన్ను
సి) ఆస్తిపై వారసత్వ పన్ను డి) పైవన్నీ

3. విత్తవిధానంలో ప్రభుత్వం రుణాలను ఈ వి ధంగా స్వీకరిస్తుంది?
ఎ) బ్యాంకులు బి) మార్కెట్ రుణాలు
సి) బాండ్లు, సర్టిఫికెట్స్ జారీచేయడం డి) పైవన్నీ

4. ప్రభుత్వ వ్యయంలో ప్రణాళికేతర వ్యయమంటే?
ఎ) రుణాలకు వడ్డీ చెల్లింపులు
బి) పెన్షన్లు, రక్షణ రెవెన్యూ వ్యయం
సి) ప్రభుత్వ ఆస్తుల నిర్వహణకయ్యే ఖర్చులు
డి) పైవన్నీ

5. పురోగామి పన్నుల విధానమంటే?
ఎ) సంపన్న వర్గాలు వినియోగించే వస్తువులపై ఎక్కువ పన్నులు విధించడం
బి) తక్కువ ఆదాయ వర్గాలు ఉపయోగించే వస్తువులపై పన్నులు ఎత్తివేయడం
సి) లోటుబడ్జెట్ విధానం డి) ఏదీ కాదు

6. ఫిస్కల్ విధానాలకు సంబంధించి కింది వాటిలో ఏది సరైంది?
ఎ) ఫిస్కల్ విధానాలకు పార్లమెంటు ముం దస్తు అనుమతి తప్పనిసరి
బి) ఆర్‌బీఐ అనుమతులు తప్ప నిసరి
సి) రాష్ట్ర ప్రభుత్వాల ముందస్తు అనుమతులు అవసరం
డి) ఏదీ కాదు

7. లోటు ఆర్థిక విధానం ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి అంత మంచి ది కాదు. కారణం?
ఎ) ద్రవ్యోల్బణం మరింత పెరిగి పేదప్రజ లు మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతారు
బి) స్థూల డిమాండు పెరిగినంత వేగంగా ఉత్పత్తుల సరఫరాలు పెరగవు
సి) ఎ, బి డి) కొనుగోలు శక్తి హరిస్తుంది

8. ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం (FRBM Act) ఉద్దేశం
ఎ) స్థూల జాతీయోత్పత్తిలో ద్రవ్యలోటు ఐదు శాతానికి పైగా మించకుండా నియంత్రించడం
బి) ఎగుమతులు ప్రోత్సహించడం
సి) ద్రవ్య సరఫరాను ఎక్కువ చేయడం
డి) ఏదీ కాదు

9. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం అమలుచేస్తున్న 'భారత నిర్మాణ్' కార్యక్రమం...?
ఎ) విత్తపరమైన చర్య బి) ద్రవ్యపరమైన చర్య
సి) ఎగుమతుల వృద్ధి చర్య డి) ఏదీ కాదు

10. ప్రస్తుతం కేంద్రప్రభుత్వ రుణాలకు సంబంధించి 2007-08 నాటికి కిందివాటిలో ఏది సరైంది?
ఎ) ఆస్తులను సృష్టించడానికే ప్రభుత్వ రుణాలను ఉపయోగించాలి
బి) ప్రభుత్వం చేస్తున్న రుణాలలో 46 శాతం ప్రస్తుతం ప్రభుత్వ ఖర్చులకే (Current Expenditure) వినియోగిస్తున్నారు
సి) మొత్తం ప్రభుత్వ రుణాల్లో 56 శాతం ఆస్తుల సృష్టికి వినియోగిస్తున్నారు
డి) పైవన్నీ

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10
	D	D	D	D	A	A	C	A	A	D